పసుపు బోర్డుకు నిధులు కేటాయించకపోవడం అన్యాయం

- రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంజర భూమయ్య

సమావేశంలో మాట్లాడుతున్న కంజర భూమయ్య

ఖలీల్‌వాడి, మార్చి 22 : నిజామాబాద్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన పసుపు బోర్డుకు నిధులు కేటాయించకపోవడం అన్యాయమని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంజర భూమయ్య అన్నారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. రాష్ట్ర రైతు సంఘం మహాసభలు ఈనెల 25, 26, 27వ తేదీల్లో నిజామాబాద్ జిల్లాకేంద్రంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. 25న మధ్యాహ్నం 12 గంటలకు ప్రెస్‌క్లబ్ నుంచి పూలాంగ్‌లోని గోనెరెడ్డి ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ, అనంతరం బహిరంగ సభ ఉంటుందని తెలిపారు.

ఈతచెట్టు పైనుంచి పడి ఒకరు మృతి

వర్ని (రుద్రూర్), మార్చి 22 : మండలంలోని జాకోర గ్రామానికి చెందిన కర్రెగోని దత్తాగౌడ్ (54) చెట్టు పైనుంచి కింద పడి శనివారం మృతి చెందాడు. కర్రెగోని దత్తాగౌడ్ కల్లు తీసేందుకు ఈత వనంలోకి వెళ్లాడు. చెట్టుపైనుంచి కింద పడడంతో సమాచారం అందుకున్న కుటుంబీకులు చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు సాయిబాబాగౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు.

ఫిట్స్‌తో మరొకరు..

రుద్రూర్, మార్చి 22 : మండలంలోని రాయకూర్ గ్రామానికి చెందిన మోగిరి సుభాష్ (40) ఫిట్స్‌తో మృతిచెందినట్లు కుటుంబీకులు తెలిపారు. సుభాష్‌కు యాక్సిడెంట్‌లో కాలు విరగడంతో ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ నెల 19న ఇంటి నుంచి బయటికి వెళ్లిన సుభాష్ తిరిగి ఇంటికి రాలేదు. శుక్రవారం రాత్రి సులేమాన్‌నగర్ శివారులోని నిజాంసాగర్ కాలువ వద్ద మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. మృతదేహం తమ కుమారుడిదేనని తండ్రి మాగిరి చిన్నసాయిలు గుర్తించాడు. మృతిపై ఎలాంటి అనుమానం లేదని, కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి, ఫిట్స్‌తో మృతిచెంది ఉంటాడని కుటుంబీకులు ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు.

ఈదురుగాలులు, అకాల వర్షాలకు రైతులు ఆందోళన చెందుతున్నారు. చేతికొచ్చిన వరి పంట ఎక్కడ దెబ్బతింటుందోనని పంటను యంత్రాలతో కోత కోయిస్తున్నారు. చందూర్ మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో వరి కోతలు జోరుగా సాగుతున్నాయి. వాతావరణం సరిగ్గా లేకపోవడంతో వరి కోత యంత్రాలతో రాత్రింబవళ్లు కోతలు కోయిస్తున్నారు.

– చందూర్, మార్చి 22

తవ్వారు... వదిలేశారు

కంఠేశ్వర్ ప్రాంతంలోని మీ సేవ కేంద్రం వద్ద ఏర్పడిన గుంత

కంఠేశ్వర్, మార్చి 22 : జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్ మీసేవ కేంద్రం వద్ద ప్రధాన రహదారిపై గుంత ప్రమాదకరంగా మారింది. మున్సిపల్ అధికారులు వాటర్ పైపులైన్ మరమ్మతుల్లో భాగంగా ప్రధానరహదారి మధ్యలో గుంతను తవ్వి నామమాత్రంగా పూడ్చి చేశారు. పెద్ద సంఖ్యలో వాహనాల రాకపోకల నేపథ్యంలో పెద్ద గుంత ఏర్పడి వాహనదారులకు ఇబ్బందికరంగా మారింది. దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి, గుంతను పూర్తిగా పూడ్చివేయాలని ప్రజలు కోరుతున్నారు.

అంతర్జాతీయ సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ భారత జట్టుకు ఎంపికైన జక్రాన్‌పల్లికి చెందిన గన్న వర్షిణిని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో శనివారం సన్మానించి, అభినందించారు. వర్షిణి సుద్దపల్లి గురుకుల పాఠశాలలో చదువుతున్నది. ఈనెల 25 నుంచి 30వ తేదీ వరకు తైవాన్‌లో నిర్వహించే టోర్నమెంట్‌లో పాల్గొననున్నట్లు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సొప్పరి వినోద్ తెలిపారు.

–జక్రాన్‌పల్లి, మార్చి 22

పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన సీపీ

కేంద్రం పరిసరాలను పరిశీలిస్తున్న సీపీ సాయిచైతన్య

వినాయక్‌నగర్, మార్చి 22 : జిల్లా కేంద్రంలోని ఎస్ఎఫ్ఎస్ పరీక్షా కేంద్రాన్ని నిజామాబాద్ సీపీ సాయిచైతన్య శనివారం పరిశీలించారు. విద్యార్థులకు ట్రాఫిక్ సమస్య ఇబ్బంది తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం స్పాట్ వాల్యుయేషన్ జరుగుతున్న నిర్మల హృదయ స్కూల్‌ను పరిశీలించారు. సీపీ వెంట నగర సీఐ శ్రీనివాస్ రాజ్, సిబ్బంది ఉన్నారు.

'పీఎం - కుసుమ్'పై అవగాహన

కంఠేశ్వర్, మార్చి 22 : జిల్లా కేంద్రంలోని పవర్ హౌస్ కాంపౌండ్ వద్ద ఉన్న గోల్డెన్ జూబ్లీ మీటింగ్ హాల్‌లో శనివారం ఉదయం 11 గంటలకు విద్యుత్ శాఖ (టీజీఎన్‌పీడీసీఎల్), టీజీఆర్‌ఈడీసీవో ఆధ్వర్యంలో పీఎం కుసుమ్ పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. దరఖాస్తుదారులకు ఈ పథకంపై అవగాహన కల్పించినట్లు నిజామాబాద్ పీజీ ఎన్‌పీడీసీఎల్ రాపల్లి రవీందర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అదనపు కలెక్టర్ అంకిత్ హాజరై మాట్లాడారు. సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి అవసరమైన సాంకేతిక విషయాలు, బ్యాంకు రుణాలపై వివరించారు. కార్యక్రమంలో జిల్లా మేనేజర్ రమణ, అశోక్ చౌహాన్, ఎస్‌బీఐ లీడ్ మేనేజర్ అల్లాపూర్ రమేశ్, వెంకటరమణ, మహ్మద్ ముక్తార్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షల నిర్వహణపై కలెక్టర్ అభినందన

ఖలీల్‌వాడి, మార్చి 22 : ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీగా విజయవంతంగా ముగిసిన నేపథ్యంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు జిల్లా ఇంటర్ విద్యాధికారితో పాటు పరీక్షల నిర్వహణ కమిటీని శనివారం అభినందించారు. జిల్లా ఇంటర్ విద్యాధికారి తిరుమలపుడి రవికుమార్, పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు చిన్నయ్య, రజీయొద్దీన్ అస్లాం, హై పవర్ కమిటీ సభ్యుడు శ్రీనాథ్ తదితరులతో పాటు సహకరించిన విద్యుత్, ఆర్టీసీ, వైద్యారోగ్య, పోస్టల్, మున్సిపల్, గ్రామపంచాయతీ అధికారులను అభినందించారు. జాయింట్ కలెక్టర్ కిరణ్‌కుమార్ అన్ని విభాగాలను సమన్వయం చేసి, ఇంటర్ పరీక్షలను విజయవంతంగా పూర్తి చేయించారని జిల్లా ఇంటర్ విద్యాధికారి కృతజ్ఞతలు తెలిపారు.

అధ్యాపకులు నిబద్ధతతో పనిచేయాలి

- జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్

ఖలీల్‌వాడి, మార్చి 22 : పేద విద్యార్థులకు మంచి భవిష్యత్తును అందించేందుకు వృత్తి నిబద్ధతతో పని చేయాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ అన్నారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పెద్ద సంఖ్యలో విద్యార్థులను చేర్పించేందుకు కృషిచేయాలని, వారికి మెరుగైన విద్యను అందించాలని సూచించారు. జిల్లాకేంద్రంలోని ఖిల్లా ప్రభుత్వ బాలుర పాఠశాలలో అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించగా.. ఆయన హాజరై మాట్లాడారు. సర్వీస్ కమిషన్ ద్వారా నియామకమైన 46 మంది అధ్యాపకులు జిల్లాలోని పలు ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో విధుల్లో చేరినట్లు తెలిపారు. సమావేశంలో ప్రిన్సిపాళ్ల సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నయ్య, కార్యదర్శి చంద్రవిఠల్, ప్రిన్సిపాళ్లు పాషా, శ్రీనాథ్, రజీయుద్దీన్ అస్లాం, గంగాధర్, నారాయణ, పవన్, సురేశ్‌బాబు, ప్రసాద్, సభ్యులు జాఫర్, ప్రకాశ్, రఘునందనాచార్యులు, సురేశ్, శంకర్, అరవింద్ పాల్గొన్నారు.

బార్ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రారంభం

– వినాయక్‌నగర్, మార్చి 22 : నిజామాబాద్ బార్ అసోసియేషన్ వార్షిక ఎన్నికలల్లో భాగంగా నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ శనివారం ప్రారంభమైంది. వివిధ పదవుల కోసం అభ్యర్థుల నుంచి వచ్చిన నామినేషన్లను ఎన్నికల అధికారులు, సీనియర్ న్యాయవాదులు వెంకటేశ్వర్, ఆర్ఎస్ఎల్ గౌడ్ ఎన్నికల కార్యాలయంలో స్వీకరించారు. ఈనెల 26 వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని తెలిపారు.

జిల్లాలో 11 క్షయ రహిత గ్రామాల ఎంపిక

ఖలీల్‌వాడి, మార్చి 22 : జిల్లావ్యాప్తంగా టీబీ ముక్త్ గ్రామపంచాయతీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు డీపీవో శ్రీనివాస్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 545 గ్రామపంచాయతీల్లో 11 గ్రామపంచాయతీలు క్షయ రహిత గ్రామాలుగా ఎంపికైనట్లు వెల్లడించారు. 11 జీపీలే కాకుండా అన్ని గ్రామాల్లో టీబీని నిర్మూలించే విధంగా కృషిచేస్తున్నామని పేర్కొన్నారు.

టీబీ ముక్త్ గ్రామాలు ఇవే..

పడకల్, లక్ష్మాపూర్, పాల్దా, ముల్లంగి, గంగరమంద, పోత్నూర్, తాళ్ల రామడగు, అబ్బాపూర్, సుంకెట్, ఓడ్యాట్, మల్కాపూర్ తండా.

టీబీ వ్యాధిపై అవగాహన

డిచ్‌పల్లి, మార్చి 22 : మండలకేంద్రంలోని మానవతాసదన్‌లో నిజామాబాద్ డివిజన్ పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు, వైద్యసిబ్బందికి టీబీ వ్యాధిపై శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఎల్పీవో శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. టీబీ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, టీబీ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషిచేయాలని సూచించారు. డివిజన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో టీబీ సర్వే పూర్తయ్యిందని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్, ఎంపీడీవో శ్రీనివాస్‌గౌడ్, ఎంపీవోలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి ఫిజిక్స్, ఎకనామిక్స్ మూల్యాంకనం

ఖలీల్‌వాడి, మార్చి 22 : ఈనెల 24 నుంచి ఫిజిక్స్, ఎకనామిక్స్ సబ్జెక్టుల మూల్యాంకనం ప్రారంభమవుతుందని జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ తెలిపారు. ఫిజిక్స్, ఎకనామిక్స్ అధ్యాపకుల ఆర్డర్ కాపీలను ఇంటర్ బోర్డు ఆయా కళాశాల లాగిన్లలో నిక్షిప్తం చేసినట్లు పేర్కొన్నారు. అపాయింట్‌మెంట్ ఆర్డర్లను డౌన్‌లోడ్ చేసుకొని, 24న ఉదయం 10.30 గంటలకు మూల్యాంకన కేంద్రంలో అధ్యాపకులు రిపోర్టు చేయాలని ఆదేశించారు. కళాశాలల ప్రిన్సిపాళ్లు ఫిజిక్స్, ఎకనామిక్స్ అధ్యాపకులను రిలీవ్ చేయాలని ఆదేశించారు. నాట్ అపాయింట్‌మెంట్ లిస్ట్‌లో ఉన్న అధ్యాపకులను కూడా మూల్యాంకనం విధుల్లోకి తీసుకుంటామని స్పష్టం చేశారు.

జిల్లాస్థాయి క్రీడాపోటీలు ప్రారంభం

కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రగతిశీల మహిళా సంఘం జాతీయ నాయకురాలు సంధ్య

ధర్పల్లి, మార్చి 22 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీవైఎల్, ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే జిల్లా స్థాయి క్రీడా పోటీలను ప్రగతిశీల మహిళా సంఘం జాతీయ నాయకురాలు సంధ్య శనివారం ప్రారంభించి మాట్లాడారు. స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ 94వ స్మారకోత్సవాన్ని పురస్కరించుకుని క్రీడాపోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ సరిత, పీవైఎల్ నాయకుడు వనమాల సత్యం, ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి సాయారెడ్డి, ధర్పల్లి వీడీసీ చైర్మన్ గుండయ్య, నాయకులు దాసు, బాలయ్య పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్ తనిఖీ

కోటగిరి, మార్చి 22 : మండలకేంద్రంలోని ప్రభుత్వ ఎస్సీ హాస్టల్‌ను ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి శనివారం తనిఖీ చేశారు. హాస్టల్ పరిసరాలు, వంట గది, వంట సామగ్రిని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం అందించాలన్నారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు.

కొనసాగుతున్న ఎస్సెస్సీ పరీక్షలు

ఖలీల్‌వాడి, మార్చి 22 : జిల్లాలో పదోతరగతి పరీక్షలు కొనసాగుతున్నాయి. రెండో రోజు శనివారం హిందీ పరీక్ష నిర్వహించారు. పరీక్షలకు మొత్తం 22,724 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా.. 22,685 మంది హాజరయ్యారని, 39 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈవో అశోక్ వెల్లడించారు.

పోస్టర్ల ఆవిష్కరణ

డిచ్‌పల్లి, మార్చి 22 : గ్రామపంచాయతీ మున్సిపల్ కార్మిక సంఘాల రాష్ట్ర విలీన సభను ఈనెల 27న నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జేపీ గంగాధర్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్.శ్యాంసన్ కార్మికులను కోరారు. మండల కేంద్రంలోని నడ్పల్లి జీపీ కార్యాలయం వద్ద విలీన సభ పోస్టర్లను శనివారం ఆవిష్కరించి మాట్లాడారు. కార్మికులు ఐక్యంగా ఉండి కేంద్ర, రాష్ట్ర వ్యతిరేక విధానాలపై పోరాడాల్సిన అవసరముందన్నారు.

విద్యుత్ అధికారుల 'పొలంబాట'

పోతంగల్, మార్చి 22 : మండలంలోని టాక్లీ గ్రామంలో విద్యుత్ అధికారులు శనివారం పొలంబాట నిర్వహించారు. రైతులను విద్యుత్ సరఫరా గురించి అడిగి తెలుసుకున్నారు. బోర్లకు కెపాసిటర్లు ఏర్పాటు చేయించుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. విద్యుత్ అంతరాయం తదితర సమస్యలకు 1912 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ నగేశ్, ఇన్‌చార్జి ఏఈ ఫక్రుద్దీన్, లైన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, లైన్‌మన్ దినేశ్, ప్రకాశ్, రైతులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

సిరికొండ, మార్చి 22 : మండలంలోని కొండూర్ తదితర గ్రామాల్లో శుక్రవారం కురిసిన వడగండ్ల వానకు నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐయూకేఎస్ రాష్ట్ర నాయకుడు వి. ప్రభాకర్ కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో అకాలవర్షానికి దెబ్బతిన్న పంటలను ఆయన శనివారం పరిశీలించారు. భూగర్భజలాలు అడుగంటి పంటలు ఎండుతున్న తరుణంలో వడగండ్ల వాన రైతులను మరింత ముంచిందన్నారు. ప్రభుత్వం నష్టపోయిన రైతాంగానికి రూ. 70 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, దేవారాం, బాబన్న, కిషన్, కిశోర్, జనార్దన్, మహిపాల్ పాల్గొన్నారు.

కొండూర్‌లో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న ఏఐయూకేఎస్ నాయకులు

వైద్యుడి మృతికి నివాళి

బాల్కొండ, మార్చి 22: బాల్కొండ ప్రభుత్వ దవాఖానలో పనిచేసే వైద్యుడు శ్రీకాంత్ శుక్రవారం గుండెపోటుతో మృతిచెందాడు. బాల్కొండ ప్రభుత్వ దవాఖాన వైద్యులు, సిబ్బంది శనివారం అతడి చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. ఆయన రోగులకు అందించిన సేవలు గుర్తుచేసుకున్నారు.

నివాళులర్పిస్తున్న వైద్య సిబ్బంది

గుడిసెకు నిప్పు

జానకంపేటలో కాలిపోయిన గుడిసె

ఎడపల్లి, మార్చి 22: మండలంలోని జాన్కంపేట్ గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో గుడిసె కాలిన ఘటన శనివారం చోటు చేసుకున్నది. బాధితురాలు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జాన్కంపేట్ గ్రామానికి చెందిన దండ్ల నర్సవ్వ గుడిసెకు గుర్తు తెలియని వ్యక్తులు శనివారం ఉదయం నిప్పంటించారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో నిప్పు పెట్టడంతో నిత్యావసర సరుకులు, బట్టలు, రూ.30 వేల నగదు, రెండు తులాల బంగారం బీరువాతో సహా కాలిపోయాయి. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.

బార్ అసోసియేషన్ ఎన్నికల షెడ్యూల్ విడుదల

బోధన్, మార్చి 22: తెలంగాణ బార్ అసోసియేషన్ కౌన్సిల్ ఆదేశాల మేరకు బోధన్ బార్ అసోసియేషన్ ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల అధికారులు వెల్లడించారు. ఎన్నికల అడ్‌హక్ కమిటీ అధికారులు నందకుమార్, సి. గోపాల్ రెడ్డి ఈ వివరాలను శనివారం మీడియాకు వెల్లడించారు. ఈనెల 26వ తేదీ వరకు ఎన్నికల నామినేషన్ల స్వీకరణ, 27న స్క్రూట్నీ, 28వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని తెలిపారు. ఏప్రిల్ 4న ఉదయం 10:30 నుంచి సాయంత్రం 4.30గంటల వరకు ఎన్నికలు నిర్వహించి, పోలింగ్ అనంతరం కౌంటింగ్ చేపట్టి, విజేతలను ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు.

NAMASTHE TELANGANA CLASSIFIEDS
నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED
★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-330667-All

BUILDING FOR SALE
★New RCC Building 2BHK ,H:No 4-2-21 built in 484Sq.yard plot for Sale @ 70 Lacs, near :DSP Office, Opp: Vani Vidyanikethan School, Shakar Nagar, Bodhan, Mob: 9960996111. Gulf NRI's , Employees, Business person can contact directly.
NTZ-338564

EAPCET NEET
ONLINE CRASH COURSE
30 days @ Rs 8888/-
TEST SERIES
5 Grand Tests @ 888/-
50% Discount Today
Call: 8645 322 633
Jatadhara Ed Tech

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

మానవ అక్రమ రవాణాపై అవగాహన కల్పించాలి

డీపీఎం సాయిలు

భీమ్‌గల్‌లో నిర్వహించిన మండల సమాఖ్య సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ డీపీఎం సాయిలు

మోర్తాడ్, మార్చి 22: మానవ అక్రమ రవాణా నివారించేందుకు మహిళా సంఘ సభ్యులందరికీ అవగాహన కల్పించాలని ఐకేపీ వ్యవసాయ విభాగం డీపీఎం మారుతి అన్నారు. కమ్మర్‌పల్లి మండలసమాఖ్య కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. అతి నిరుపేదలు బలహీన వర్గాలకు చెందిన వారిని గుర్తించి, వారి బలహీనతలను అసరాగా చేసుకుని అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని చెప్పారు. ఈ విషయమై అన్ని గ్రామాల్లో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి మహిళలందరినీ చైతన్య పర్చాలన్నారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలనిసూచించారు. సమావేశంలో ఏపీఎం కుంట గంగాధర్, మండల సమాఖ్య అధ్యక్షురాలు రోజారాణి, సీసీలు రవికుమార్, పీర్యా, భాగ్యలక్ష్మి, ధనలక్ష్మి, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

భీమ్‌గల్‌లో మండల సమాఖ్య సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ డీపీఎం సాయిలు మహిళలనుద్దేశించి మాట్లాడారు. సులభంగా డబ్బు సంపాదించాలన్న ఆలోచనలతో ఉన్నవారు మానవ అక్రమ రవాణాకు యత్నిస్తారని, ఈ విషయంపై మహిళలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఏపీఎం రవీందర్, సెర్ప్ అధికారులు శ్రీనివాస్, నరేశ్, గంగసాయిలు, రఘు, భాస్కర్, గంగాధర్, సుమలత, గంగలలిత, గణేశ్, ముత్యం, అరుణ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

వేల్పూర్(భీమ్‌గల్), మార్చి 22: భీమ్‌గల్ పోలీస్‌స్టేషన్‌ను ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు.

చలివేంద్రం ప్రారంభం

మోర్తాడ్, మార్చి 22: కమ్మర్‌పల్లి మండలం హాసాకొత్తూర్ జీపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో రాజశ్రీనివాస్, ఎస్సై అనిల్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. కార్యదర్శి నర్సయ్య, ప్రవీణ్, రేవతి గంగాధర్, ఏనుగు రాజేశ్వర్, బద్దం రవి తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ముప్కాల్, మార్చి 22: ముప్కాల్‌లో ఎస్సై రజనీకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం వాహనాలు తనిఖీ చేశారు. నిబంధనలు పాటించని పలువురికి జరిమానా విధించారు.

తల్లిదండ్రులను బాగా చూసుకోవాలి

మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి నసీం సుల్తానా

ఆర్మూర్‌టౌన్, మార్చి 22: వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను పిల్లలు బాగా చూసుకోవాలని ఆర్మూర్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి నసీం సుల్తానా సూచించారు. ఆలూర్ మండలం మిర్దాపల్లి గ్రామంలో శనివారం మండల లీగల్ అవేర్నెస్ కమిటీ, బ్యాంక్ ఆఫ్ బరోడా ఆధ్వర్యంలో న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ సివిల్ జడ్జి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చిన్ననాటి నుంచి కలిసి పెరిగిన అన్నదమ్ములు ఒక ఇంటి వారైన అనంతరం ఆస్తుల విషయంలో బంధాలను మరిచి శత్రువులుగా మారడం సరైంది కాదన్నారు. సమస్యలు తలెత్తినప్పుడు సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. బ్యాంకు రుణాలను సకాలంలో చెల్లించి అధికారులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, బ్యాంక్ ఆఫ్ బరోడా అధికారులు, న్యాయవాదులు, వృద్ధులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

మోర్తాడ్, మార్చి 22: సాయుధ విప్లవ వీరులు భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌ల వర్ధంతి సభలను విజయవంతం చేయాలని పీవైఎల్, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో మోర్తాడ్‌లో శనివారం పోస్టర్ల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌ల స్ఫూర్తితో ప్రశ్నించి వ్యవస్థ మార్పు కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ నాయకులు అరవిందసింగ్, నందినీకౌర్, పర్వీందర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

నవీపేట మండలంలో పలు బాధిత కుటుంబాలను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాంకిషన్‌రావు శనివారం పరామర్శించారు. బాధిత కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఆయనవెంట పార్టీ మండలాధ్యక్షుడు నర్సింగ్‌రావు, నాయకులు ఉన్నారు.

- నవీపేట, మార్చి 22

రాష్ట్రస్థాయి శిక్షకుడిగా హాసాకొత్తూర్ వాసి

నియామకపత్రం అందుకుంటున్న నరేశ్

మోర్తాడ్, మార్చి 22: యాంటీ నార్కొటిక్స్ బ్యూరో రాష్ట్రస్థాయి శిక్షకుడిగా కమ్మర్‌పల్లి మండలం హాసాకొత్తూర్ గ్రామానికి చెందిన ఉట్నూర్ నరేశ్ ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ పోలీసు కమిషనరేట్ తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ డైరెక్టర్ సందీప్ శండిల్యా ఆధ్వర్యంలో శిక్షణ పొంది శనివారం నియామకపు పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడుతూ.. డ్రగ్స్ బాధితులు కాని, డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు అనుమానం ఉంటే 1908 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలియజేయాలని సూచించారు.

ముందస్తు అరెస్టు

శక్కర్‌నగర్/ మోర్తాడ్, మార్చి 22: అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా కార్మిక సంఘాల నాయకులను పోలీసులు శనివారం ముందస్తు అరెస్టు చేశారు. బోధన్‌లో బి. మల్లేశ్, పుట్ట వరదయ్య, జె. శంకర్ గౌడ్, సంజయ్‌ను, కమ్మర్‌పల్లి మాస్‌లైన్ నాయకులు సారా సురేశ్, అశోక్, బాలయ్యను అరెస్టు చేసి ఆయా పోలీస్‌స్టేషన్లకు తరలించారు.

బోధన్‌లో పోలీసులు అరెస్టు చేసిన నాయకులు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మెండోరా, మార్చి 22: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలో శనివారం ఉదయం చోటుచేసుకున్నది. ఎస్సై నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. భైంసా మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన జాదవ్ గజారాం(32) బతుకుదెరువు కోసం మూడేండ్ల క్రితం మెండోరాకు వచ్చి కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం ఉదయం బస్సాపూర్ నుంచి పోచంపాడ్ వైపునకు హైవేపై నడుచుకుంటూ వెళ్తున్నాడు. గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొనడంతో తల పగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తమ్ముడు మారుతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నారాయణ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరు..

వేల్పూర్, మార్చి 22: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని పచ్చల నడ్కుడ గ్రామంలో వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన శంకర్(45) తొమ్మిది నెలలుగా పచ్చల నడ్కుడలో నివసిస్తున్నాడు. అతడితోపాటు అదే గదిలో నెల రోజులుగా బాలాజీ ఉంటున్నాడు. గదిలో నుంచి దుర్వాసన వస్తున్నదని గ్రామస్తులు పోలీసులకు తెలుపడంతో.. వారు వెళ్లి పరిశీలించారు. అప్పటికే శంకర్ మృతిచెందాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉన్నదని ఎస్సై సంజీవ్ తెలిపారు. మృతదేహాన్ని ఆర్మూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు పేర్కొన్నారు.

ఇసుక తరలిస్తున్న లారీ సీజ్

ఆర్మూర్‌టౌన్, మార్చి22: ఆర్మూర్ పట్టణం పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ శనివారం తెలిపారు. లారీ డ్రైవర్‌తోపాటు యజమానిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బోధన్ తైబజార్, పశువధశాలకు వేలం

శక్కర్‌నగర్, మార్చి 22: బోధన్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో తైబజార్, పశువధశాల నిర్వహణకు శనివారం వేలం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేలంలో తైబజార్ కోసం 32 మంది పోటీ పడగా మహ్మద్ కబీర్ అహ్మద్ రూ.23.45లక్షలకు దక్కించుకున్నాడు. పశువధశాల వేలంలో 14 మంది పాల్గొనగా రూ. 4.25లక్షలకు అబ్దుల్ అజీజ్ సొంతం చేసుకున్నాడు.

రెండు బస్సులు ఢీ

రెంజల్, మార్చి 22: మండలంలోని సాటాపూర్ గ్రామంలో శనివారం రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొన్నాయి. ఈ ఘటనలో బస్సు అద్దాలు ధ్వంసమైనట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ప్రజలు, వాహనాలు పెద్ద సంఖ్యలో తరలిరావాడంతో సంత కిక్కిరిసిపోయింది. దీంతో ఆర్టీసీ బస్సులు ట్రాఫిక్‌లో చిక్కుకున్నాయి. ట్రాఫిక్‌ను తప్పించే క్రమంలో బోధన్ డిపోనకు చెందిన బస్సు అద్దాలు ధ్వంసమైనాయి. సుమారు అరగంటపాటు వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో కొనుగోలుదారులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సామర్థ్యానికి మించి వాహనాలు వస్తున్నా.. అక్కడ పర్యవేక్షించే వారు కరువయ్యారని స్థానికులు మండిపడుతున్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

వేల్పూర్(భీమ్‌గల్), మార్చి 22: బాలికను వేధించిన కేసులో తీగల అక్షయ్ అనే యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. అక్షయ్ భీమ్‌గల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన మైనర్‌కు ఫోన్ చేస్తూ అసభ్యకరంగా ప్రవర్తించేవాడన్నారు. శనివారం ఉదయం బాలికను బలవంతంగా ఇంట్లోకి లాక్కెల్లి అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో ఆమె కేకలు వేయటంతో అక్షయ్ అక్కడి నుంచి పారిపోయాడు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయగా మైనర్ బాలిక కేసును ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి దర్యాప్తు చేపట్టారు. ఏసీపీ వెంట సీఐ సత్యనారాయణగౌడ్, సిబ్బంది ఉన్నారు.